నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 నిజామాబాద్ గురువారం 27 మార్చి 2025 ADILABAD NIRMAL



ఎడారిని తలపిస్తున్న మత్తడి వాగు ప్రాజెక్టు




# ఇంకిన మత్తడి

## ప్రశ్నార్థకంగా 8,500 ఎకరాల ఆయకట్టు

● చివరి దశలో యాసంగి వరి సాగు ● కాలువల ద్వారా నీరందించాలని వేడుకోలు

ఆదిలాబాద్, మార్చి 26(నమస్తే తెలంగాణ) : జిల్లాలో రైతుల పరిస్థితి దయనీయంగా మా రింది. ఎండాకాలం ప్రారంభంలోనే భూగర్భజలాలు అడుగంటడంతో సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. సాగునీటి ప్రాజెక్టులు వెలవెలబోతున్నాయి. తాంసి మండలంలోని మత్తడి వాగు పరిస్థితి అధ్వానంగా మారింది. ఈ ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 0.57 టీఎంసీలు కాగా.. వానకాలంలో కురిసిన వర్షాలతో పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకున్నది. ఈ ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా ఆదిలాబాద్ రూరల్, తాంసి, భీంపూర్ మండలాల పరిధిలోని 8,500 ఎకరాలకు సాగునీరు సరఫరా అవుతున్నది. వానకాలం పంటలకు నీటి సరఫరా జరిగింది. ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉండడంతో రైతులు యాసంగిలో జొన్న, శనగ, కూరగాయల పంటలను వేశారు.

### నీరందక ఎండిపోతున్న పంటలు

మత్తడివాగు ప్రాజెక్టులో నీరు బాగా తగ్గింది. ఎండల ప్రభావంతో నీటిమట్టం తగ్గిపోగా, అధికారుల పర్యవేక్షణ లోపం ఫలితంగా చివరి ఆయకట్టుకు నీరు సరఫరా కావడం లేదు. కాలువల నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో పొలాలకు నీరుపారడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులు కోరినా ఫలితం లేదని, అధికారుల పర్యవేక్షణ లోపం ఫలితంగా తాము నష్టపోవాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ప్రాజెక్టులో ఉన్న నీటితో తమ పంటలను కాపాడేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### కాలువ ద్వారా నీరందించాలి..

నేను ఆరెకరాల భూమిని కౌలుకు తీసుకుని జొన్న వేశా. ఇందుకోసం రూ.1.50 లక్షల పెట్టుబడి అయింది. సబ్ కెనాల ద్వారా పైపులు వేసి పంటకు నీరు ఇస్తామను కుంటే కాలువ పారడం లేదు. దీంతో జొన్న పంట పెరగక ఎండిపోయే ప్రమాదం నెలకున్నది. నాతోపాటు ప్రాజెక్టు చివరి ఆయకట్టు రైతుల పరిస్థితి అధ్వానంగా తయారైంది. లక్షల రూపాయల పెట్టుబడితో సాగు చేసిన పంటలు నీరు అందక నష్టపోవాల్సి వస్తుంది. అధికారులు స్పందించి కాలువ ద్వారా నీటిని సరఫరా చేస్తే కొంత పంట అయినా చేతికొచ్చే అవకాశాలున్నాయి.

- మల్లెల గణేశ్, రైతు, కప్పర్ల, తాంసి మండలం



ఎండిపోతున్న జొన్న పంటను చూపిస్తున్న రైతు మల్లెల గణేశ్

## ఎండుతున్న పంటలు.. ఆందోళనలో రైతులు



తురాటి గ్రామంలో నీరు లేక బీటలువారిన పొలాన్ని చూపిస్తున్న రైతు

వేసవి రాకముందే భూగర్భ జలాలు తగ్గుతున్నాయి. బోరు బావుల్లో నీరు తగ్గి పంటలు ఎండిపోతున్నాయి. నిర్మల్ జిల్లా నర్సాపూర్(జి) మండలంలో దాదాపుగా ఈ సీజన్‌లో వందల ఎకరాల్లో వరి, మొక్కజొన్న వేసినట్లు రైతులు తెలిపారు. చెరువులు, కుంటల్లో నీరు అడుగంటిపోయింది. రోజు రోజుకు భూగర్భ జలాలు తగ్గడంతో సాగు చేసిన వరి ఎండుతోంది. నీరు తగ్గడంతో మండలంలోని తురాటి గ్రామంలో వరి పంట ఎండిపోతుంది. అప్పడే బీటలువారాయి. మరో పది రోజుల్లో పంట పూర్తిగా దెబ్బ తినే పరిస్థితి నెలకున్నది.

- నర్సాపూర్ (జీ), మార్చి 26



తురాటిలో నీళ్లు లేక ఎండుతున్న జొన్న పంట

## బతుకు వేట.. ఉపాధి బాట

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని రత్నాపూర్‌కాండ్లి గ్రామానికి చెందిన మత్స్యకారులు చేపలను వేటాడుతూ ఉపాధి పొందుతున్నారు. ఆ గ్రామంలో 70 కుటుంబాలు ఉండగా.. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో చేపలు, రొయ్యలు వలల ద్వారా పడుతారు. పచ్చి చాపలను అమ్మగా మిగిలిన వాటిని ఎండబెడతారు. ఈ ఎండు చేపలు, రొయ్యలను ఆరబెట్టి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ వచ్చే డబ్బు లతో ఉపాధి పొందుతున్నారు.



రొయ్యలను ఎండబెడుతున్న మత్స్యకారుడు



ఎండబెట్టిన చేపలు

## ఇందిరమ్మ మోడల్ హౌస్ పరిశీలన

● పైలెట్ జీపీల్లో ఇండ్లకు అధికారుల మార్కింగ్

● లబ్ధిదారులు నిర్లక్ష్యం చేయకుండా పనులు ప్రారంభించాలి ● నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

ఖానాపూర్, మార్చి 26 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతి మండలానికి ఒక మోడల్ హౌస్ నిర్మాణ ప నులు చేపడుతున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. బుధవారం ఖానాపూర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో నిర్మిస్తున్న మోడల్ హౌస్ నిర్మాణ ప నులను పరిశీలించారు. ఇంటి లోపల డిజైన్, సౌకర్యాలపై అధికారులకు కీలక సూచనలు చేశారు. పనులు గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలోని పైలెట్ విలేజ్‌లో కొనసాగుతున్న ఇందిరమ్మ సర్వే, మార్కింగ్, ఇంటి నిర్మాణ పనులపై ఆరా తీశారు. హౌసిం గ్ పనులకు అధికారులు మార్కింగ్ చేసిన స్థలాల్లో లబ్ధిదారులు నిర్లక్ష్యం చేయకుండా పనులు ప్రారంభించాలని అన్నారు. ఇతర ప్రాంతాల్లో ఇండ్ల సర్వే కొనసాగుతుందని దశలవారీగా అర్హులందరికీ ఇండ్లు వస్తాయని వివరించారు. అనంతరం ఎంపీడీవో చాంబర్‌లో మున్సిపల్, రెవెన్యూ అధికారులతో ఎల్ఆర్ఎస్, ఇంటి పన్నుల వసూళ్లపై తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట హౌసింగ్ పీడీ రాజేశ్వర్, ఎంపీడీవో సునీత, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో రత్నాకర్ ఉన్నారు.



ఇందిరమ్మ ఇంటి నమూనాను పరిశీలిస్తున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

## ఆసుపత్రిని సందర్శించిన కాయకల్ప బృందం

ఉట్నూర్, మార్చి 26 : ఉట్నూర్ జిల్లా ఆసుపత్రిని బుధవారం కాయకల్ప బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ల్యాబ్, రోగులకు అందుతున్న సౌకర్యాలు, మందులు నిర్వహణ, పరిశుభ్రత, వికలాంగులు ఆసుపత్రికి వచ్చేందుకు సౌకర్యాలు, సిబ్బంది పనితీరు, బెడ్స్ నిర్వహణ అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉపేందర్ మాట్లాడుతూ.. ఆసుపత్రిని కాయకల్ప టీం సందర్శించిందని, త్వరలో మరో టీం వస్తుందన్నారు. తమకు మూడేండ్లుగా కాయకల్ప సర్టిఫికెట్ వస్తుందన్నారు. అలాగే ఈ సంవత్సరం కూడా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.



వైద్యసిబ్బందితో కాయకల్ప బృందం సభ్యులు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్లు

## నీటి ఎద్దడిని తీర్చండి..

### కలెక్టర్‌కు మాజీ కౌన్సిలర్ల వినతి

ఎదులాపురం, మార్చి 26 : ఆదిలాబాద్ పట్టణంలో మూడు దశాబ్దాల్లో ఎప్పుడు లేని విధంగా నీటి ఎద్దడి కొనసాగుతోందని కాంగ్రెస్ పార్టీ తాజా మాజీ కౌన్సిలర్లు ఆరోపించారు. బుధవారం కలెక్టర్ రాజర్షితోపాటు మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మరో రెండు నెలల్లో నీటి ఎద్దడి అతి తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉన్నందున దీనిపై ప్రత్యేక దృష్టి సాధించాలని కోరారు. అదేవిధంగా లాండసాంగి వద్ద రెండు చెక్ డ్యాంలు నిర్మించాలని, మావల వాటర్ వద్ద మట్టి పూడికతీత తీయాలని, పట్టణంలో మరో 10 వాటర్ ట్యాంకర్లు కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా కాలనీలలో ఉన్న ప్రతి వాటర్ ట్యాంకు వద్ద మరో పెద్ద బోరు వేసి వాటి నీటిని ట్యాంకు ఎక్కించాలన్నారు. నిర్మల్ నుంచి మిషన్ భగీరథ నీరు కూడా నిరంతరంగా వచ్చేటట్లు చేయాలన్నారు. ఈ మేరకు కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వీరిని కలిసిన వారిలో జహీర్ రంజానీ, కలాల శ్రీనివాస్, బండారి సతీష్, సంద నర్సింగ్, ఆవుల వెంకన్న, దర్శనాల లక్ష్మణ్, ఇజ్జగిరి సంజయ్ ఉన్నారు.

## రైస్ మిల్లు సీజ్

నర్సాపూర్ (జీ), మార్చి 26 : మండల కేంద్రంలోని శ్రీ అనంత ఆగ్రో రైస్ మిల్లును రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం సీజ్ చేశారు. 2022-2023 ఖరీఫ్, రబీ సీజన్‌లలో 3,191 మెట్రిక్ టన్నుల ధాన్యం తీసుకున్నారు. కొన్ని నెలలుగా ఆగ్రో రైస్ మిల్లు ఉపయోగంలో లేనందున నోటీసులు పంపినా స్పందించకపోవడంతో శ్రీ ఆగ్రో రైస్ మిల్లు వద్దకు అధికారులు వెళ్లారు. అక్కడ గేట్ తాళాలు వేసి ఉన్నందున యజమానికి సమాచారం ఇచ్చారు. అధికారులు దాదాపు ఒక గంట సేపు వేచి చూశారు. ఫలితం లేక పోవడంతో తాళాలు వేసిన గేట్‌ను పగలగొట్టి పూర్తి వివరాలు తీసుకుని పంచనామా చేశారు. అనంతరం సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్, సివిల్ సప్లయ్ అధికారిని ఎన్‌ఫోర్స్ మెంట్ డీటీ రమాదేవి, ఏఎస్ఐ శంకర్, ఆర్ఐ నవత జ్యోతి, జూనియర్ అసిస్టెంట్ రాజు కుమార్ పాల్గొన్నారు.



రైస్ మిల్లును సీజ్ చేస్తున్న అధికారులు

## ట్రిపుల్ ఐటీలో హౌస్ కీపింగ్ కార్మికుల నిరసన

బాసర, మార్చి 26 : నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీ హౌస్ కీపింగ్ కార్మికులు బుధవారం తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆర్జీయూకేటీ ప్రధాన ద్వారం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు బైఠాయించారు. తమకు మూడేండ్లుగా పెరిగిన జీతాలు, ఈఎస్ఐ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలల నుంచి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.



ఆర్జీయూకేటీ ప్రధాన ద్వారం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు